క్లుప్తంగా

ఖాద్రీశుడి సేవలో దేవదాయశాఖ సలహాదారుడు



జ్వాలాపురం శ్రీకాంత్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

కదిరి టౌన్‌: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని దేవదాయశాఖ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్‌ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, అర్చకులు శ్రీకాంత్‌కు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు. ప్రసాదం అందజేసి, శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ గోపాలకృష్ణ, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లిలో వైద్య శిబిరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గాండ్లపెంట: కటారుపల్లి పంచాయతీ గొల్లపల్లిలో మలేరియా మాసోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ వైద్యాధికారులు శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు మహేశ్వరమారుతి, బాబా ఫక్రుద్దీన్‌, కదిరి మలేరియా సబ్‌యూనిట్‌ అధికారి రామాంజులు ఆధ్వర్యంలో 32 మందిని పరీక్షించారు. అందులో ఇద్దరు జ్వర పీడితుల రక్త నమూనాలు తీసుకుని మందులు అందజేశారు. అనంతరం మలేరియా నివారణపై ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాషా, ఉపేంద్రారెడ్డి, సీహెచ్‌ఓ రష్మి, ఎఎన్‌ఎం రమాదేవి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

కదిరి అర్బన్‌: మండల పరిధిలోని చవిటితండా సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం హార్ట్‌ టు హెల్ప్‌ సంస్థ ఆధ్వర్యంలో విత్తనాలు నాటే కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సాయంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు సంస్థ అధ్యక్షుడు రవి నాయక్‌ తెలిపారు. వర్షాకాలంలో విత్తనాలు నాటితే నీటి సమస్య లేకుండా త్వరగా మొక్కలు పెరుగుతాయన్నారు. కానుగ 50 కేజీలు, సీతాఫలం 10 కేజీలు, గురిగింజ 5 కేజీల విత్తనాలు నాటినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మీదేవి బాయి, నరసింహులు నాయక్‌, అంజినాయక్‌ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ ఉపాధ్యాయిలను సన్మానించిన దృశ్యం

నల్లమాడ: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన 32 మంది ఉపాధ్యాయులను శుక్రవారం ఎంఈఓ వేమనారాయణ అధ్యక్షతన స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో సన్మానించారు. అలాగే బదిలీపై మండలానికి వచ్చిన 29 మంది ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సురేష్‌ బాబు, ఉపాధ్యాయులు ఎం.వెంకట్రామిరెడ్డి, రవీంద్రారెడ్డి, ఎన్‌ఈ రామాంజనేయులు, రవిశంకర్‌, నాగేంద్ర తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయండి



ఎంఈఓ-2 శ్రీనివాసులును సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

గాండ్లపెంట: స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఇటీవల ఎంఈఓ-2గా బాధ్యతలు చేపట్టిన ఎం.శ్రీనివాసులును శుక్రవారం వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఎంఈఓ కృష్టానాయక్‌ సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాసులు, రామ్మోహన్‌, సుబ్బారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, విద్యాసాగర్‌, వేణుగోపాల్‌ రెడ్డి, కర్ణాకర్‌, ప్రసాద్‌, హైదర్‌వలీ, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా బంద్‌

ధర్మవరం అర్బన్‌: ధర్మవరం పట్టణంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నీటి సరఫరా బంద్‌ చేస్తున్నామని మున్సిపల్‌ కమిషనర్‌ బండి శేషన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం ఫిల్ట్రేషన్‌ ప్లాంట్‌ వాటర్‌ వర్క్స్‌లో ఉన్న క్లారిఫ్లోక్యులేటర్‌ను శుభ్రం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం నీటి సరఫరా చేస్తామని తెలిపారు.

ఏమైనా సమస్యలు ఉన్నాయా?

- వాటి పరిష్కారానికే ఇంటి వద్దకు వచ్చాను
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కేతిరెడ్డి



మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని సత్వరం పరిష్కరించేందుకు మీ ఇంటి వద్దకు వచ్చానని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 14వ వార్డులో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులోని ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో డ్రైనేజీ కాలువలను సరిగ్గా శుభ్రం చేయలేదని పలువురు విన్నవించారు. ఎప్పటికప్పుడు కాలువలు, రహదారులు శుభ్రం చేయించాలని మున్సిపల్‌ కమిషనర్‌ శేషన్నను ఎమ్మెల్యే ఆదేశించారు. శస్త్ర చికిత్స చేయించుకునేందుకు ఇబ్బందిగా ఉందని ఓ దివ్యాంగురాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చింది. ఆరోగ్యశ్రీ కిందకు రాకపోతే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఆపరేషన్‌ చేయిస్తానని బాధితురాలికి భరోసా ఇచ్చారు. ఇంటి పట్టా వచ్చింది. గునాది కట్టాను. బిల్లులు పడలేదని ఓ వ్యక్తి ఎమ్మెల్యేకు తెలిపాడు. ఇంటి పట్టాను పరిశీలించగా అది నకిలీదని తేలింది. వెంటనే ఎస్‌ఐతో మాట్లాడిన ఎమ్మెల్యే.. నకిలీ పట్టా ఎలా వచ్చిందో తెలుసుకోవాలని ఆదేశించారు. నకిలీ పట్టా ఎవరు ఇచ్చారో గుర్తించాలన్నారు. ఇంటి పట్టా ఇచ్చారు కాని ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఇల్లు కట్టుకోలేనని ఓ మహిళ ఎమ్మెల్యేకు తెలిపింది. హౌసింగ్‌ అధికారులే ఇల్లు కట్టించి ఇస్తారని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు.

అర్హులకు పథకాలు అందించాలి

కాలువలో మురుగునీరు బ్లాక్‌ కాకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. తన భర్త మృతి చెందితే బ్యాంకులో అప్పు నన్ను కట్టమని ఒత్తిడి చేస్తున్నారని ఓ మహిళ ఎమ్మెల్యేకు విన్నవించింది. బ్యాంకు అధికారులతో మాట్లాడుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. సచివాలయ పరిధిలో ఏ చిన్న సమస్య కూడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. అర్హత ఉన్న లబ్ధిదారుల ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలులో భాగంగా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ బండి శేషన్న, వార్డు కౌన్సిలర్‌ శివ, వార్డు సచివాలయాల కన్వీనర్‌ చందమూరి నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్‌ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలు అభివృద్ధి చెందాలి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్డీటీ డైరెక్టర్‌ విశాలఫెర్రర్‌

బత్తలపల్లి: భర్త చనిపోయిన ఒంటరి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సమాజంలో గౌరవం లభిస్తుందని ఆర్డీడీ మహిళా సాధికారిత డైరెక్టర్‌ విశాల ఫెర్రర్‌, ఆర్డీ ప్రమీల కుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీటీ ఫీల్డ్‌ కార్యాలయంలో ఏటీఎల్‌ రుక్మాంగద అధ్యక్షతన ఒంటరి మహిళల సాధికారత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భర్త చనిపోయి ఒంటరిగా ఉన్న మహిళలు సమాజంలో ఉన్న రకరకాల కట్టుబాట్లతో అవమానానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం, ఆర్డీటీ ప్రవేశపెట్టిన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధైర్యాన్ని కోల్పోకుండా పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. అంతకు ముందు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో సీఓలు వెంకటేష్‌, నాగరాజు, తిమ్మరాజు, శివాజీ, లక్ష్మీనారాయణ, హెచ్‌ఓ ఉష, కౌన్సిలర్‌ శోభారాణి, కల్చరల్‌ శ్రీరాములు, ఆర్‌పి కావేరమ్మ, లీడర్లు రాధ, విజయలక్ష్మీ, లక్ష్మీ, కుళ్లాయప్ప, గంగాధర, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: సమాజంలో ఒంటరిగా జీవిస్తున్న మహిళలకు ఆర్డీటీ సంస్థ అండగా ఉంటుందని ఏటీఎల్‌ సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ ఒంటరి మహిళా సాధికార దినోత్సవం సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు.

ఓటరు నమోదు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఆర్డీఓ తిప్పేనాయక్‌

ధర్మవరం అర్బన్‌: బీఎల్‌ఓలు ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆర్డీఓ తిప్పేనాయక్‌ తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ సమావేశ భవనంలో శుక్రవారం బీఎల్‌ఓలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇప్పటికే అవసరమైన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జులై 20వ తేదీ వరకూ కొనసాగించాలని తెలిపారు. జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటా ఓటర్ల పరిశీలన చేపట్టాలన్నారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్‌ 29 వరకూ పోలింగ్‌ స్టేషన్‌లలో క్రమబద్ధీకరణ, తదితర కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. సెప్టెంబర్‌ 30 నుంచి అక్టోబర్‌ 16 వరకు 8 రకాల ఫార్మెట్‌లను రూపొందించడం జరుగుతుందన్నారు. అక్టోబర్‌ 17న సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, అక్టోబర్‌ 17 నుంచి నవంబర్‌ 30 వరకు క్లైముల అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. అక్టోబర్‌ 28, 29, నవంబర్‌ 18,19 తేదీల్లో బూత్‌ స్థాయిల్లో క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. జనవరి 1వ తేదీన తుది జాబితా ప్రచురణకు కమిషన్‌ అనుమతి పొందడం జరుగుతుందని తెలిపారు. జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు వయసు నిండిన యువతి, యువకులను ఓటర్లుగా నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ యోగేశ్వరి దేవి, మున్సిపల్‌ కమిషనర్‌ బండి శేషన్న, ఎన్నికల ఉప తహసీల్దార్‌ అనిల్‌కుమార్‌, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

'శోత్రియం' రైతులకు విత్తన వేరుశనగ



విత్తన కాయలు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ రమణారెడ్డి

ఓడీ చెరువు: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తంగేడుకుంట శోత్రియం భూములు సాగు చేసుకుంటున్న రైతులకు సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలు అందజేస్తోందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ ఆవుటాల రమణారెడ్డి అన్నారు. శుక్రవారం సర్పంచ్‌ అబీదాబీ అధ్యక్షతన తంగేడుకుంటలో విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం కూడా శోత్రియం రైతులకు లబ్ధి చేకూరే కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. శోత్రియం భూముల సాగు రైతులకు సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలతో పాటు, బీమా వంటి పథకాలను అందిస్తోందన్నారు. తంగేడుకుంటలో పట్టాదారు పాసుబుక్కులు లేని 800 మంది రైతులకు 600 క్వింటాళ్ల విత్తన కాయలను మంజూరు చేసిననట్లు చెప్పారు. వేరుశనగ పంటతో పాటు చిరుధాన్యాలను కూడా సాగు చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ సనావుల్లా, జెడ్పీటీసీ సభ్యుడు కుర్లి దామోదర్‌ రెడ్డి, మండల కన్వీనర్‌ రాజునాయుడు, మార్కెట్‌ యార్డ్‌ చైర్మెన్‌ శ్రీనివాసరెడ్డి, ఏఓ ఇలియాజ్‌, ఎంపీటీసీ రమణ, గ్రామ వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మహమ్మద్‌ రఫీఖాన్‌, మండల బీసీ సంఘం అధ్యక్షుడు చింతా వెంకటేష్‌, గ్రామ కన్వీనర్‌ సనత్‌కుమార్‌, నాయకులు రమేష్‌ ,క్రిష్టారెడ్డి, వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి



నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు

పుట్టపర్తి టౌన్‌: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్‌ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం పట్టణంలోని గణేష్‌ కూడలిలో ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు మోకాళ్లపై నడుస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టెక్నో, ఒలంపియాడ్‌, ఐఐటీ, జేఈఈ, మెయిన్స్‌, నీట్‌, ఎంసెట్‌ పేరుతో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. హాస్టల్‌ వసతులు లేకపోయినా వేలాంది మంది విద్యార్థులతో హాస్టల్స్‌ నడుపుతున్నారన్నారు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు కాషన్‌ డిపాజిట్‌, దోబీ, పాకెట్‌ మనీ పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ధనార్జనే ధ్యేయంగా విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రింట్‌ చేసిన పాఠ్యపుస్తకాలు కాకుండా సొంతంగా పబ్లికేషన్‌ ఏర్పాటు చేసుకుని రూ.10 వేల నుంచి 15 వేల వరకూ డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పవన్‌, అరుణ్‌ కుమార్‌ రెడ్డి, మహేంద్ర, సహాయ కార్యదర్శులు పోతులయ్య, నరసింహ మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు శివ, దేవా, నవీన్‌, జగదీష్‌, విష్ణు, కిషోర్‌, విజయ్‌, సాయి హేమంత్‌ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం



విద్యార్థులకు టీచింగ్‌ కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్‌: భవిష్యత్‌ తరాల మనుగడ కోసం పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని రూరల్‌ అగ్రికల్చర్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ వ్యవస్థాపకుడు మదన్‌మోహన్‌ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బుక్కపట్నం కేజీబీవీ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన ఇంటి పరిసర ప్రాంతాలు, కొండ గుట్టల్లో చెట్లు నాటాలన్నారు. విద్యార్థులు గ్రామాల్లోని ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. మొక్కలు నాటేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తలమర్ల సంజీవరెడ్డి పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు.

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం

బత్తలపల్లి/గాండ్లపెంట/ఎన్‌పీకుంట/అమడగూరు/పుట్టపర్తి టౌన్‌/తాడిమర్రి/కదిరి టౌన్‌/కదిరి అర్బన్‌/రామగిరి/కనగానపల్లి: తాడేపల్లి నుంచి సీఎం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు వీక్షించారు. అలాగే తహసీల్దార్‌, ఎంపీడీఓ కార్యాలయాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో అధికారులు సమావేశాలు నిర్వహించారు. ప్రతి సచివాలయంలో 11 రకాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు ప్రజలకు అందించేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారికి 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు, ధ్రువపత్రాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వెల్లడించారు. మండలంలో రెండు టీములు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క టీంలో ముగ్గురు అధికారులు ఉంటారన్నారు. వలంటీర్లు వారికి కేటాయించిన ఇళ్లలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, జేసీఎస్‌ మండల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తుస్సుమన్న టీడీపీ బస్సుయాత్ర

- కానరాని అత్తార్‌ వర్గం
- జనం లేక వెలవెలబోయిన బస్సుయాత్ర
- రూ. 400 కూలి ఇచ్చి జనం తరలింపు



జనసమీకరణపై ఫోన్‌లో మాట్లాడుతున్న టీడీపీ నేత కందికుంట వెంకట ప్రసాద్‌

కదిరి: టీడీపీ చేపట్టిన 'భవిష్యత్‌కు గ్యారంటీ బస్సు యాత్ర' పేరుతో చేపట్టిన యాత్ర తొలిరోజే తుస్సుమంది. శుక్రవారం కదిరి నియోజకవర్గం నుంచి ఈ యాత్ర ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా పలు జిల్లాల నుండి టీడీపీ నేతలు పాల్గొన్నప్పటికీ జనం నుంచి స్పందన కరువైంది. బస్సుయాత్రకు జనం పెద్దగా హాజరు కాకపోవడంతో చివరకు ఒక్కొక్కరికి రూ.400 కూలి ఇచ్చి కొంత మందిని పిలిపించినట్లు టీడీపీ నాయకులే బహిరంగంగా చెప్పారు. మొదట చంద్రబాబు నాయుడు ఈ బస్సుయాత్రలో పాల్గొంటారని ప్రచారం చేసినప్పటికీ ఆయన హాజరు కాలేదు. తర్వాత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు పాల్గొంటారని చెప్పారు. చివరకు ఆయన కూడా హాజరు కాలేదు. చేసేది లేక ఉమ్మడి అనంతపురం, ఉమ్మడి వైఎస్సార్‌ జిల్లా నేతలతో యాత్ర మొదలెట్టి మొదటి రోజు ఎలాగో మమ అన్పించారు.

అబద్ధాల మేనిఫెస్టో అది!

కదిరి వేమారెడ్డి కూడలిలో ఎన్‌టీఆర్‌ విగ్రహానికి పూలమాల వేసి అక్కడ కార్యకర్తలు, ప్రజలనుద్దేశించి నాయకులు ప్రసంగించారు. వైఎస్సార్‌ కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాగా ఇబ్బంది పడుతున్నారని కదిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌ కందికుంట వెంకట ప్రసాద్‌ మాట్లాడుతుంటే అక్కడున్న జనం 'జగన్‌ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు కదా..!' అని బహిరంగంగా అన్నారు. తలుపుల మండలంలో టీడీపీ నాయకులు ఇటీవల చంద్రబాబు మహానాడు వేదికగా ప్రకటించిన మేనిఫెస్టో అంశాలను ప్రస్తావించారు. ఇది విన్న జనం 'అది అబద్ధాల మ్యానిఫెస్టో' అన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రజలకు ఏమి చేశారు' అని జనం ప్రశ్నించారు.

పత్తా లేని అత్తార్‌ వర్గం

నియోజకవర్గంలో ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ 'భవిష్యత్‌కు గ్యారంటీ బస్సుయాత్ర'కు అత్తార్‌ చాంద్‌బాషాతో పాటు ఆయన వర్గీయులెవ్వరూ హాజరు కాలేదు. టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా చెప్పుకునే కందికుంట వెంకట ప్రసాద్‌ తమను పార్టీ కార్యక్రమాలకు దేనికీ పిలవడం లేదని, అందుకే తాము బస్సుయాత్రకు హాజరు కాలేదని వారంటున్నారు. జనం రాలేదని సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలపై కందికుంట తీవ్ర స్థాయిలో మండిపడినట్లు చాంద్‌వర్గం చెబుతోంది. కదిరి నియోజకవర్గంలో ముస్లింల జనాభా ఎక్కువగా ఉందని, వచ్చే ఎన్నికల్లో ఇక్కడ అత్తార్‌ చాంద్‌బాషాకు ఎమ్మెల్యే టికెట్‌ ఇవ్వక పోతే టీడీపీకి ఇక్కడ వరుసగా మూడోసారి ఓటమి తప్పదని, వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీకి హ్యాట్రిక్‌ గెలుపు ఖాయమని వారు అత్తార్‌ వర్గం అంటోంది. పార్టీ కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా పదవులు, ఎమ్మెల్యే టికెట్‌లు ఎలా వస్తాయని అత్తార్‌ చాంద్‌బాషాను ఉద్దేశించి కందికుంట వర్గం అంటోంది.

రెచ్చిపోయిన అత్తార్‌ వర్గీయుడు

తలుపుల: భవిష్యత్‌కు గార్యంటీ ప్రజా చైతన్య బస్సుయాత్ర కదిరి నుంచి బట్రేపల్లి మీదుగా తలుపులకు 11 గంటలకు రావాల్సిన బస్సుయాత్ర సాయంత్రం 5:30 గంటలకు ఆలస్యంగా చేరుకుంది. బస్సుయాత్ర ఆలస్యం కావడంతో ఎవరిదారిలో వారు వెళ్లిపోవడంతో బోసిపోయింది. బస్సుయాత్రలో భాగంగా అత్తార్‌ చాంద్‌బాషా వర్గీయుడు బాబా బాషా అలియాస్‌ పండు జిల్లా నాయకులపై మండిపడ్డారు. జిల్లాలో ఒకే ఒక్క మైనార్టీ మాజీ ఎమ్మెల్యే అత్తార్‌ చాంద్‌బాషాను ఎందుకు పిలవలేదని ప్రశ్నించాడు. ఇంతకంటే మైనార్టీలకు అవమానం మరొకటి లేదన్నాడు. మైనార్టీల తడాఖా తప్పకుండా చూస్తారని వాపోయాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు సర్ది చెప్పడంతో గొడవ సద్దు మణిగింది. కాగా.. బస్సు యాత్రకు వచ్చేందుకు మండల వాసులు ఆసక్తి చూపలేదు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి సుమారు రెండు వందల వాహనాల్లో జనాల్ని పిలిపించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా కృష్ణ ప్రసాద్‌

తాడిమర్రి: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్‌ కృష్ణప్రసాద్‌ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన డాక్టర్‌ మహేంద్రనాథ్‌ నార్పల మండలం బండ్లపల్లి పప్పూరుకు బదిలీపై వెళ్లారు. దీంతో నల్లమాడ మండలం రెడ్డిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిగా పని చేస్తున్న కృష్ణప్రసాద్‌ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

బత్తలపల్లి: ప్రయాణాలు చేసే సమయంలో చోరీలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలోఎస్‌ఐ టీవీ శ్రీహర్ష ఆదేశాలతో ముద్రించిన కరపత్రాలను ఏఎస్‌ఐ సోమశేఖర్‌మూర్తి, కానిస్టేబుల్‌ రామలింగం పంపిణీ చేశారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే డయల్‌ 100కు ఫోన్‌ చేయాలన్నారు. దిశా యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకోవాలని సూచించారు. ఆపదలో బత్తలపల్లి ఎస్‌ఐ 9440796833 నంబర్‌ ఫోన్‌ చేయాలన్నారు.

టెన్త్‌ సప్లిమెంటరీలో 71 మంది ఉత్తీర్ణత

అమడగూరు: పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. మండల వ్యాప్తంగా ఉన్న 6 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలల నుంచి మొత్తం 124 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు మండల విద్యాధికారులు తెలిపారు. ఇందులో 71 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

డైట్‌ సెట్‌ ర్యాంకర్లకు అభినందన

కదిరి అర్బన్‌: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్‌ కళాశాల విద్యార్థులు ఉర్దూ మీడియం డైట్‌ సెట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఎస్‌.మహి రాష్ట్రస్థాయి 4వ ర్యాంక్‌, సమీనా కౌసర్‌ 5వ ర్యాంక్‌, ఎన్‌.ఎస్‌ షీమాసాధియా 6వ ర్యాంక్‌, ఎస్‌.షీమా సాధియా 13వ ర్యాంకులతో సత్తా చాటారు. శుక్రవారం విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌ చెన్నకేశవ ప్రసాద్‌, అధ్యాపకులు అబ్దుల్‌ రషీద్‌ అభినందించారు.

ఎంఈఎఫ్‌ మండల కమిటీ ఎన్నిక

నల్లమాడ: మాదిగల ఉద్యోగ సమాఖ్య (ఎంఈఎఫ్‌) మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఈఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్‌ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గౌరవ సలహా మండలి సభ్యులుగా ఆదిఆంధ్ర నరసింహులు, రామ్మూర్తి, మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పోలంవాండ్లపల్లి దివాకర్‌ను ఎన్నుకున్నారు. అలాగే అధ్యక్షుడిగా ఆదిఆంధ్ర రమేష్‌ (వంకరకుంట), ఉపాధ్యక్షుడిగా రామాంజులు (డీ.రామాపురం), వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా సూర్యనారాయణ (నల్లమాడ), ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్‌ (కొండకింద తండా), అదనపు ప్రధాన కార్యదర్శిగా నరసింహులు, కోశాధికారిగా నాగభూషణం (నల్లమాడ)ను ఎన్నుకున్నారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు

బత్తలపల్లి: అకారణంగా గొడవలకు దిగుతూ, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో ఎస్‌ఐ టీవీ శ్రీహర్షతో కలిసి పర్యటించారు. ఇటీవల జరిగిన ఘర్షణలపై ఆరా తీశారు. గొడవలు ఎందుకు జరిగాయి అంటూ వివరాలు సేకరించారు. గొడవలు జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. మరోసారి ఘర్షణలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐకి సూచించారు. నిందితులు ఎంత మంది ఉన్నారు? ఎందర్ని అరెస్టు చేశారని అడిగి తెలుసుకున్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేద్దాం

కనగానపల్లి: బాల్య వివాహాలకు పూర్తిగా అడ్డుకట్ట వేసి ఆడ పిల్లల భవితకు బంగారు బాటలు వేద్దామని మహిళాశక్తి సొసైటీ అధ్యక్షురాలు వహీదా పిలుపునిచ్చారు. శుక్రవారం మండల శివపురం గ్రామంలో మహిళా శక్తి సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మహిళా చట్టాలు, గృహ హింస, బాల్య వివాహాల నిషేధంపై ప్రజలకు నాటకాల రూపంలో ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో టింబక్టు కలెక్టివ్‌ ప్రోగ్రాం మేనేజర్‌ సుకన్య, సీఈఓ రజనీ పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ నమోదు పూర్తి

తనకల్లు: విత్తన వేరుశనగ నమోదు ప్రక్రియ పూర్తి అయినట్లు మండల వ్యవసాయాధికారి శ్రీహరినాయక్‌ శుక్రవారం తెలిపారు. మండలానికి 4,581 క్వింటాళ్ల వేరుశనగను కేటాయించిందన్నారు. 5,054 మంది రైతులకు మొత్తం 4,361.1 క్వింటాళ్లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కొక్కంటి రైతు భరోసా కేంద్రంలో పంపిణీ చేసి మిగిలిన 100.50 క్వింటాళ్లు (335) బ్యాగులను ఏపీ సీడ్స్‌ సంస్థకు వెనక్కి పంపినట్లు తెలియజేశారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు



గాయపడిన చిన్నారులు సునంద, ప్రేమ

కదిరి టౌన్‌: మున్సిపల్‌ పరిధిలోని కుటాగుళ్లలో శుక్రవారం కుక్కల దాడిలో గంగారాజు కుమార్తె సునంద, శంకర కుమార్తె ప్రేమ గాయపడ్డారు. చిన్నారులు వీధిలో ఆడుకుంటున్న సమయంలో ఆకస్మాత్తుగా వీధి కుక్కలు దాడి చేశాయి. గాయపడిన వారిని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. గతంలో విధి కుక్కలు దాడిలో చాలా మంది చిన్నారులు గాయపడ్డారు. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్‌ కమిషనర్‌కు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. కనీసం ఇప్పటికైనా స్పందించి వీధి కుక్కలను పట్టణానికి దూరంగా తరలించాలని కోరుతున్నారు.